# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## 12 వ భాగం

## కూర్మావతారం

భాగవతంలో వచ్చే సురాసుర యుద్ధాలు, అమృతంకోసం పాలసముద్రం చిలకడం అనేవి రసవత్తరంగా ఉంటాయనడానికేమీ సందేహంలేదు. పోతన ఇందులో పద్యాలు రాసేటప్పుడు ఒక్కోచోట మంచి హాస్యంగానూ, ఒక్కోచోట భక్తితోటి రాసేడు. సురాసుర యుద్ధం అంటే మనలో ఉండే ప్రవృత్తులే. ఒక్కోసారి మన పాజిటివ్ మైండ్ గెలుస్తూ ఉంటుంది, కానీ ఇంకోసారి బాగా నెగటివ్ గా తయారౌతూ ఉంటాం. పాలసముద్రం చిలకడం అంటే మనలో జరిగే అంతర్మధనమే. చివరకి బ్రహ్మ జ్ఞానం పొందేక లభించేది అమృతత్వం కనక ఈ చిలకడంలో చివరగా అమృతం లభిస్తుందనేదే ఈ కధ.

ఈ లోపున అనేక కోరికలు (కోరికలు గుర్రాలు కనక ఉచ్చైశ్రవం దొరకడం), కావల్సినదల్లా ప్రసాదించే కల్పవృక్షం (అష్ట, అణిమా సిద్ధులు) అవీ రావడం గమనించవచ్చు. అవి తీసుకుని వాటిలో సంతృప్తి పడితే అమృతం దొరకదు. వాటిని జయించి/విసర్జించి ముందుకెళ్తేనే అమృతం దొరుకుతుంది. ఈ ప్రక్రియలో లక్ష్మీ – అంటే సంపదలన్నీ రావడం అనేది ఒక సిద్ధి. అక్కడ ఆగిపోతే ఇంక ముందుకెళ్ళడం అసాధ్యం. ఇందులో మళ్ళీ హాలాహలం బయటకొస్తుంది. అంటే ఇలా చిలికే కొద్దీ మనసులో కల్మషాలన్నీ కట్టకట్టుకుని విషంలాగా బయటకొస్తాయి. వీటన్నింటినీ వదుల్చుకోవాలి.

సొంత ప్రయత్నంతో ఇవన్నీ అసాధ్యం. అందుకే ఇవి బయటకొచ్చాక వాటిని తీసుకోమని (మనలో ఉంచుకోలేము కనక) పరమేశ్వరుణ్ణి ప్రార్ధించడం అవన్నీను. యుద్ధం జరుగుతున్నప్పుడు దేవతలూ (మనలో మంచి లక్షణాలు), అసురులూ (చెడ్డవి) ఇద్దరూ చచ్చిపోతున్నారు. దీనికి సరైన మార్గం ఏమిటంటే పాల సముద్రాన్ని చిలకడం అని విష్ణువు చెప్పేడు దేవతలకి (మంచి లక్షణాల వల్లే మనం భగవంతుణ్ణి ఆశ్రయించాం అని ఒప్పుకుంటే). అందుచేత వీళ్లందరూ రాక్షసులదగ్గిరకెళ్ళి బతిమాలేరు, రండి అందరం కల్సి ఇలా చిలుకుదాం అని (మనం అంటే మన మంచి, చెడు అన్నీ కల్సి ఉన్న మన మనస్సే. చెడు అనేది ఒక్కసారి వదలదు కనక మంచి లక్షణాలతో చెడులక్షణాలని బతిమాలి దారిలోకి తెచ్చుకోవాలి.)

ఇదేం కథ? అన్నీ హరి ఐనప్పుడు మనం అసలెందుకు ఏమైనా చెయ్యాలి? ఆయనే చేసేయకూడదూ? అలా కుదరదు. మన కర్మ మనం అనుభవించితీరవల్సిందే. మనం కాళ్ళు చాపుకుని కూర్చుని "అన్నీ నువ్వే చూసేయ్ కూడదూ" అంటే కుదరదు. అందుకే మన ప్రయత్నం మనం చేసి తీరాలి. సరే, మంధర పర్వతం తేవడానికి బయల్దేరారు. దాన్ని ఎత్తి పట్టుకొస్తూంటే అది చేతిలోంచి జారిపోయి దానికింద చాలా మంది పడిపోయేరు. అప్పుడు ఇలా అనుకున్నారుట.

క. ఏలా హరికడ కేఁగితి?

మేలా దొరఁకొంటి మధిక హేలన శైలో

న్మూలనము జేసి తెచ్చితి?

మేలా పెక్కండ్రు మడిసి రేలా నడుమన్? [8-185]

అసలు శ్రీహరి దగ్గిరకి ఎందుకు వెళ్ళాం? ఇలాంటి ఆపద ఎందుకు కొనితెచ్చుకున్నాం? అప్పుడు అక్కడే ఉన్న హరి చూసాడు ఇదంతా.

వ. అని కులకుధర పతనజన్యంబగు దైన్యంబు సహింప నోపక పలవించుచున్న దివిజ దితిజుల భయంబు మనంబున నెఱింగి సకలవ్యాపకుండగు హరి దత్సమీపంబున. [8–187]

మ. గరుడారోహకుఁడై గదాదిధరుఁడై కారుణ్యసంయుక్తుఁడై

హరికోటిప్రభతో నోహో వెఱవకుం డంచుం బ్రదీపించి త

ద్గిరిఁ గేలన్ నలువొంద గందుకము మాడ్కింబట్టి క్రీడించుచు

న్గరుణాలోకసుధన్ సురాసురుల ప్రాణంబుల్ సమర్థించుచున్. [8-188]

వీళ్ళు ఇలా అనుకోగానే, వాళ్ళు అడక్కుండానే – దివిజ దితిజుల భయంబు మనంబున నెఱింగి – మీరు పాలసముద్రం దగ్గిరకి వెళ్ళండి, నేను దీన్ని తీసుకొస్తాను అని చెప్పేడు. గరుత్మంతుడితో చెప్పి దాన్ని సముద్రం దగ్గిరకి తీసుకెళ్ళేడు. అంటే మనం చేయలేని పనులు ఆయన చేయగలడు అడక్కరలేకుండానే. భగవంతుడు ఎప్పుడూ మనతో ఉన్నాడని గుర్తుంచుకుంటే చాలు.

క. చని జలరాశి తటంబున

వనజాక్షుని గిరిని డించి వందనములు స

ద్వినుతులు జేసి ఖగేంద్రుఁడు

పనివినియెను భక్తి నాత్మభవనంబునకున్. [8–190]

అలా వీళ్ళు సముద్రం దగ్గిరకి వెళ్ళేసరికి గరుడుడు పర్వతాన్ని తెచ్చి గట్టుమీద పెట్టేడు. ఇప్పుడు చిలకడానికో కవ్వం తయారైంది. మరి తాడో? దానికోసం వాసుకిని బ్రతిమాల్తున్నారు.

సీ. భూనాథ! వినవయ్య భోగీంద్రు వాసుకిఁ

బిలిపించి యతనికిఁ బ్రియము జెప్పి

ఫలభాగ మీ నొడఁబడి సమ్మతునిఁ జేసి

మెల్లన చేతుల మేను నివిరి

"నీవ కా కెవ్వరు నేర్తు? రీ పని కియ్య

కొ" మ్మని యతని కైకోలు పడసి
కవ్వంపుఁ గొండ నిష్కంటకంబుగఁ జేసి
ఘూర్ణించి యతని భోగంబుఁ జుట్టి [8-192]

ఆ. కడఁగి యమృతజలధిఁ గలశంబుఁ గావించి
త్రచ్చు నవసరమునఁ దలఁపు లమర
బద్ధవస్త్రకేశభారులై యా రెండు
గములవారు తరువఁ గదిసి రచట. [8-192.1]

నువ్వు కాక ఇంకెవరు చేయగలరు? నువ్వింత వాడివి అంత వాడివి అంటూ చేతులూ ఒళ్ళూ నిమిరి ఉబ్బగొట్టి ఒప్పించారు మొత్తంమీద. కొండ మీద ముళ్ళూ అవీ తీసేసి వాసుకిని కొండ చుట్టూ చుట్టేరు.

క. హరియును దేవానీకము
నురగేంద్రుని తలలు పట్టనుద్యోగింపన్
హరిమాయా పరవశులై
సురవిమతులు కూడి పలుకఁ జొచ్చిరి కడిమిన్. [8-194]

మిగతా దేవతల్తో పాటు శ్రీహరి కూడా వాసుకిని పట్టుకున్నాడు చిలకడానికి. కానీ ముందు జరగబోయేది భగవంతుడికి తెలుసు కనక ఆ మాయలో పడి రాక్షసులిలా అన్నారు దేవతలతో.

మత్త. స్వచ్ఛమైన ఫణంబు మీరలు చక్కఁబట్టి మథింపఁగాఁ
బుచ్ఛ మేటికి మాకుఁ బట్టఁగఁ? బూరుషత్వము గల్గి మే
మచ్ఛమైన తపోబలాఢ్యయనాన్వయంబుల వారమై
యిచ్ఛయింతుమె తుచ్ఛవృత్తికి? నిండు మాకు ఫణాగ్రముల్ [8-195]

మీరేమో మంచిదైన తల పట్టుకుంటారా? మేము తపోబలాలు ఉన్నవాళ్ళం; తోక ఎందుకు పట్టుకోవాలి? ఇలాంటి తుచ్ఛమైన పని ఎందుకు మేమెందుకు ఒప్పుకుంటాం? మీరే తోక పట్టుకోండి, మేము తల పట్టుకుంటాం అన్నారు.

క. విస్మయముఁ బొంది దానవ
ఘస్మరుఁ డహిఫణము విడువఁ గైకొని యసురుల్
విస్మితముఖులై యార్చి ర
విస్మితముగఁ గొనిరి సురలు వీఁకం దోఁకన్. [8-197]

ఇది విని దేవతలు ఆశ్చర్యంతో 'సరే' అని తోక పట్టుకోవడానికి వెళ్ళారు. విజయాభావంతో రాక్షసులు తలపట్టుకున్నారు. చిలకడం మొదలైంది.

**క. విడు విడుఁ డని ఫణి పలుకఁగఁ**
**గడుభరమున మొదలఁ గుదురు గలుగమి గెడఁవై**
**బుడబుడ రవమున నఖిలము**
**వడవడ వడఁకఁగ మహాద్రి వనధి మునింగెన్.** [8-199]

ఈలోపున వాసుకి "వదలండి, వదలండి" అని అరవడం మొదలుపెట్టేడు. కానీ కింద కుదురు అనేది లేకపోవడం వల్ల పర్వతం సముద్రంలోకి మునిగిపోయింది. దేవతలూ రాక్షలూ అంటే మహామహులే కదా? అయినా విధిని తప్పించగలరా?

పోతన తెలుగు పదాల్తో ఎలా ఆడుకున్నాడో గమనించారా? "స్వచ్ఛమైన, బుచ్ఛమేటికి, నిచ్ఛగింతుమే", "విస్మయము, ఘస్మరుడు, విస్మితము", “విడు విడు, వడ వడ, బుడ బుడ" ఇలాంటి ప్రయోగాలు చేయడంలో పోతన సిద్ధహస్తుడు. ఇలాంటివి చదువుతున్నప్పుడు అలవోకగా మన మొహాలమీదకి చిరునవ్వు వచ్చి తీరుతుంది.

**సీ. సవరనై లక్ష యోజనముల వెడలుపై**
**కడుఁ గఠోరమునైన కర్పరమును**
**నదనైన బ్రహ్మాండమైన నాహారించు**
**ఘనతరంబగు ముఖగహ్వరంబు**
**సకల చరాచర జంతురాసుల నెల్ల**
**మ్రింగి లోఁగొనునట్టి మేటి కడుపు**
**విశ్వంబుపై వేఱు విశ్వంబు పైఁబడ్డ** [8-202]

**తే. వెలికి లోనికిఁ జనుదెంచు విపుల తుండ**
**మంబుజంబులఁ బోలెడు నక్షి యుగము**
**సుందరంబుగ విష్ణుండు సురలతోడి**
**కూర్మి చెలువొంద నొక మహా కూర్మ మయ్యె** [8-202.1]

ఇలా మంధరగిరి మునిగిపోయేసరికి విష్ణువు కూర్మావతారం ధరించి దాన్ని పైకెత్తేడు. ఆ శ్రీకూర్మం కడు కఠోరమైన డిప్ప లక్ష యోజనాలు ఉందిట. అది ఎంత పెద్ద తాబేలంటే, ఆకలేస్తే బ్రహ్మాండాన్ని అంతా తినేయగలదు. అంటే ఈ మంధర పర్వతాన్ని చాలా సులభంగా మోసేయగలదు అని చమత్కారం.

క. తరిగాండ్రలోన నొకఁడట
తరి గడవకుఁ గుదురు నాఁక త్రాడఁట చేరుల్;
దరి గవ్వంబును దా నఁట
హరిహరి! హరిచిత్రలీల హరియే యెఱుఁగున్ [8-205]

చిలికేవాళ్లలో తానొకడు. చిలికే పర్వతమూ, త్రాడూ కూడా తానే. మునిగిపోకుండా ఉండటానికి మోసేదీ తానే. ఆహా (హరి హరి) హరి విచిత్రలీలలు హరికే కదా తెలుస్తాయి? ఈ విచిత్రం సంగతి ఏమిటంటే, చిలికేవాడు, చిలికించేవాడూ విష్ణువే. పాల సముద్రమూ, అందులోంచి వచ్చేవీ విష్ణువే (సర్పాణాం మస్మి వాసుకిః, సరసా మస్మి సాగరః, ఉచ్ఛైశ్రవస మశ్వానాం విద్ధిమామృతోద్భవం, ఐరావతం గజేద్రాణాం నరాణాంచ నరాధిపం – భగవద్గీత విభూతి యోగం)

హరి అనే పదాన్ని మళ్ళీ పోతన ఎలా వాడేడో చూశారా? ఇటువంటిదే మళ్ళీ వామనావతారంలో కనిపిస్తుంది. దీనినే మంత్రపుష్పంలో చూడవచ్చు.

నారాయణం మహాజ్ఞేయం విశ్వాత్మానం పరాయణం
నారాయణ పరోజ్యోతిరాత్మా నారాయణః పరః
నారాయణ పరం బ్రహ్మ తత్త్వం నారాయణః పరః
నారాయణ పరోధ్యాతా ధ్యానం నారయణః పరః

ఆ. గొల్లవారి బ్రతుకు గొఱఁతన వచ్చునె
గొల్లరీతిఁ బాలకుప్ప ద్రచ్చి
గొల్లలైరి సురలు గొల్లయ్యె విష్ణుండు
చేటు లేని మందు సిరియుఁ గనిరి. [8-207]

ఇక్కడ గొల్లవాళ్ళు అంటే మజ్జిగ చిలికే వాళ్ళనే అర్థంలో చెప్తున్నాడు. గొల్లవాళ్ళ జీవితం తక్కువది అనొచ్చా? పాలకుప్ప (పాలసముద్రం) చిలకడానికి దేవతలందరూ గొల్లవాళ్ళయ్యేరు. విష్ణువు కూడా గొల్ల అయ్యేడు. అందుకే చేటు లేని మందు (అమృతం), సిరి (లక్ష్మి) సంపాదించుకున్నారు కదా?

గొల్లవాడంటే ఇంకో అర్థంలో కృష్ణుడే కదా? అలా చూస్తే భాగవతం మొదట్లో చెప్పిన 'శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్..." పద్యంలో చివరి దళం 'మహానందాగనా డింభకున్" మళ్ళీ ఇక్కడ ధ్వనిస్తోంది. అందుకే ఆ మొదటి పద్యానికి అంత ప్రాముఖ్యత. అది తెలుగు సాహిత్యానికీ, మహాభాగవతానికీ మకుటాయమానమైన పద్యం అనడానికి ఎటువంటి సందేహం లేదు.

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)